

రంజాన్ వేళలు	ఇఫ్తార్ (శని)	సా.6.22
	సహరి (ఆది)	ఉ.4.49

20న కాకినాడ నుంచి అయోధ్యకు సూపర్‌లగ్జరీ బస్సు - 7లో

వైసీపీలో చేరిన ముద్రగడ - 7లో



నేడే నగారా

- అసెంబ్లీ ఎన్నికలకు నేడు మోగనున్న గంట
- మధ్యాహ్నం 3.30గంటలకు విడుదల కానున్న షెడ్యూల్
- తక్షణం అమల్లోకి రానున్న కోడ్: ఇప్పటికే జిల్లాలో ఎన్నికల ఏర్పాట్లు ముమ్మరం
- నేడు వైసీపీ అభ్యర్థుల తుది జాబితా వెల్లడించనున్న జగన్
- ఇప్పటివరకు ప్రత్తిపాడు, పిఠాపురం, జగ్గంపేట సీట్లపైనే అధికారిక ప్రకటన
- మిగిలిన స్థానాల్లో ఏవైనా మార్పులుంటాయేమోనని అభ్యర్థుల్లో టెన్షన్
- టీడీపీలో కాకినాడ సిటీ అభ్యర్థి ఎంపికపై ఇంకా కొనసాగుతున్న సస్పెన్స్
- ఉండవల్లిలో చంద్రబాబును కలిసిన వనమాడి: సీటుపై ఇంకా స్పష్టత నిల్
- అటు జనసేన తరపున కాకినాడ ఎంపీ అభ్యర్థి ఎంపికపైనా తర్జనభర్జన

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

ఎప్పుడెప్పుడా అని అంతా ఎదురుచూస్తున్న అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌కు ఎట్టకేలకు ముహూర్తం ఖరారైంది. ఈరోజు మధ్యాహ్నం 3.30 గంటలకు సార్వత్రిక ఎన్నికలతోపాటు రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల నిర్వ హణకు సంబంధించి ఈసీ షెడ్యూల్ విడుదల చేయనుంది. ఇందులో భాగంగా రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు ఎన్నో దశలో జరుగుతాయనే దానిపై స్పష్టత రానుంది.నామినేషన్ల ప్రక్రియ, ఉపసంహరణ, పోలింగ్, ఫలితాల వెల్లడికి సంబంధించిన తేదీలను ఈసీ వెల్లడించనుంది. తద్వారా జిల్లాలో ఎన్నికల వేడి మరింత రాజుకోనుంది. వాస్తవానికి ఎన్నికల షెడ్యూల్ ఎప్పుడెప్పుడా అని కొంతకాలంగా జిల్లాలో రాజకీయ పార్టీలు ఎదురుచూస్తున్నాయి.

ముహూర్తం ఖరారు

2019 అసెంబ్లీ ఎన్నికల సమయంలో షెడ్యూల్ అప్పట్లో మార్చి 10న విడుదలైంది. ఈలెక్కన ఈ దఫా ఎన్నికలకు సంబంధించి ఈసీ ప్రకటన ఇంకా ముందే ఉంటుందనే ప్రచారం జరిగింది. కానీ వాయిదా పడింది. చివరకు ఈనెల 14 లేదా 15న ఎట్టిపరిస్థితుల్లో షెడ్యూల్ ప్రకటిస్తారని భావించగా ఎట్టకేలకు శనివారం మహూర్తం ఖరారు చేశారు. దీంతో కేంద్ర, రాష్ట్ర ఎన్నికల కమిషన్లు ఒకే సమయంలో షెడ్యూల్‌ను విడుదల చేయనున్నాయి. కాగా శనివారం షెడ్యూల్ విడుదలైన మరుక్షణం నుంచే జిల్లాలో అసెంబ్లీ ఎన్నికల కోడ్ అమల్లోకి రానుంది. అందులోభాగంగా 24గంటల్లోగా ఎక్కడికక్కడ రాజకీయపార్టీల ఎన్నికల ఫ్లెక్సీలు, కటౌట్లు అధికారులు తొలగించాల్సి ఉంది. మంత్రులు, ఎమ్మెల్యేలు అధికారిక వాహనాలు వినియోగించడం నిషిద్ధం. ఎలాంటి కొత్త పనులకు సంబంధించిన శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయడం నిషిద్ధం. ఉద్యోగుల బదిలీలు, ప్రమోషన్లు కూడా నిషిద్ధం. అటు జిల్లా అధికారులు సైతం కోడ్ అమలుకు సంబంధించి పక్కా పగడ్బంధీ చర్యలు చేపట్టాల్సి ఉంది. ఇప్పటికే జిల్లాకు రానున్న ఎన్నికల వ్యయ పరిశీలకులు, ఇతర స్క్వాడ్, సిబ్బందికి వసతి ఏర్పాట్లు సిద్ధం చేశారు. ప్రైవేటు వ్యక్తుల వద్దనున్న గన్‌లు, ఇతర ఆయుధాలను సైతం సరెండర్ చేయాలని కలెక్టర్, ఎస్పీ ఆదేశించారు.జిల్లాలో ఏడు అసెంబ్లీ స్థానాలకు సంబంధించి మొత్తం 16.10లక్షల మంది ఓటర్లుండగా, వీరికి సంబంధించి పోలింగ్ బూత్‌లు కూడా సిద్ధం చేస్తున్నారు. ఈవీఎంలు, ఈవీఎంలు భద్రపరిచే స్ట్రాంగ్‌రూంలు కూడా ఎంపిక చేశారు. కాగా షెడ్యూల్‌కు సంబంధించి దేశవ్యాప్తంగా ఎంపీ స్థానాలకు ఎన్నికలు, రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నందున ఇక్కడ ఎన్నో దశలో పోలింగ్ నిర్వహిస్తారనేది శనివారం స్పష్టత రానుంది. 2019 సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు మొదటి విడతలో నిర్వహించారు.

ఆ ఒక్కటి ఉత్కంఠ..

జిల్లాలో ఏడు అసెంబ్లీ స్థానాలకుగాను ఇంకా ఒక్క కాకినాడ సిటీ విషయంలోనే టీడీపీ తన అభ్యర్థిని ప్రకటించాల్సి ఉంది. మిగిలిన అన్ని స్థానాల్లోను ఇప్పటికే గెలుపు గుర్రాలను ఖరారు చేసింది. కాకినాడ సిటీ విషయంలో వైసీపీ ఎమ్మెల్యే ద్వారంపూడిని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ఏం చేయాలనేదానిపై చంద్రబాబు గట్టి కసరత్తు చేస్తున్నారు. దీనికి సంబంధించి శుక్రవారం ఐవీఆర్ఎస్ సర్వే కూడా చేయించారు. మరోపక్క సీటు విషయమై స్పష్టత రాకపోవడం, మార్పు ఉంటుందన్న ప్రచారం నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే కొండబాబు శుక్రవారం ఉండవల్లి వెళ్లారు. చంద్రబాబును కలిసి నియోజకవర్గ పరిస్థితులను వివరించారు. ఆయన సోదరుడి కోడలు సుస్మిత పోటీలో ఉంటారనే ప్రచారం నేపథ్యంలో చంద్రబాబు కొండబాబుతో కాసేపు చర్చించారు. కాకినాడ సిటీ అభ్యర్థి ఎవరనేది మాత్రం వెల్లడించలేదు. దీంతో కొండబాబు శుక్రవారం రాత్రి కాకినాడకు వచ్చేశారు. ఒకటి, రెండు రోజుల్లో ఈసీటుపై స్పష్టత రానుంది. కాకినాడ ఎంపీ సీటు పొత్తులో భాగంగా జనసేనకు వెళ్లింది. ఈస్థానం నుంచి అభ్యర్థి ఎవరనేది ఇంకా వెల్లడవలేదు. తనను పోటీ చేయాలంటూ ఒత్తిడి వస్తోందని, దీనిపై ఒకటిరెండు రోజుల్లో స్పష్టత ఇస్తానని పవన్ ఇప్పటికే ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఈ సీటు నుంచి ఎవరు బరిలో ఉంటారనేది సస్పెన్స్‌గా మారింది.

అభ్యర్థుల్లో టెన్షన్ టెన్షన్

అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ కూడా విడుదలవుతున్న నేపథ్యంలో అభ్యర్థుల ఎంపికపై ఇంతకాలం ఇంకా నాన్చిన వైసీపీ ఎట్టకేలకు శనివారం మొత్తం అన్ని స్థానాల్లో జాబితా విడుదల చేయనుంది. ఇప్పటికే జిల్లాలో ఓటమి భయంతో ప్రత్తిపాడు, పిఠాపురం, జగ్గంపేట స్థానాల్లో ఎమ్మెల్యేలను తప్పించి వారి స్థానాల్లో కొత్త ఇన్‌చార్జులను నియమించింది. వీరు అసెంబ్లీ ఎన్నికల్లో అభ్యర్థులుగా కొనసాగనున్నారు. ఇవి కాకుండా కాకినాడ సిటీ, కాకినాడ రూరల్, పెద్దాపురం, తుని స్థానాల్లో ఇప్పటికీ అధికారికంగా అభ్యర్థులను ప్రకటించలేదు. పెద్దాపురం మినహా మిగిలిన మూడు స్థానాల్లో ఎమ్మెల్యేలు ద్వారంపూడి, కన్నబాబు, దాడిశెట్టి రాజా ఉన్నారు. ఈస్థానాల్లో పెద్దగా మార్పులుండవని, వీరి పేర్లే యథాతథంగా జాబితాలో ఉండొచ్చని చెబుతున్నారు. కానీ అసెంబ్లీ సీట్లలో అభ్యర్థుల బదిలీ విధానాన్ని కొత్తగా మొదలుపెట్టిన వైసీపీ ఓటమి భయంతో వీరిలో ఎవరినైనా మార్చుతుందా? అనే టెన్షన్ ఆయా నేతల అనుచరుల్లో ఉంది. అటు జగ్గంపేట, పెద్దాపురం సీట్లలో అభ్యర్థులను మార్చే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. మార్పు ఉంటుందా? లేదా యథాతథంగా వీరిని కొనసాగిస్తారా? అనేది చూడాల్సి ఉంది. ప్రధానంగా పిఠాపురం నుంచి జనసేన అధినేత పవన్ బరిలోకి దిగడం ఖాయమైన నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా ఎన్నికల్లో వైసీపీపై భారీ వ్యతిరేక ప్రభావం చూపుతుందనే ఆందోళన ఆపార్టీ నేతల్లో ఉంది. ఆ ప్రభావం తట్టుకుని ఎంతోకొంత నిలబడే అభ్యర్థుల కోసం ఏమైనా మార్పులు చేసే అవకాశం ఉన్నట్లు కూడా ప్రచారం జరుగుతోంది.

18 నుంచి 30 వరకూ పది పరీక్షలు

- ఉదయం 9.30నుంచి మధ్యాహ్నం 1.45 గంటల వరకూ నిర్వహణ
- జిల్లావ్యాప్తంగా 137 కేంద్రాలు ఏర్పాటు
- హాజరుకానున్న 32,262 మంది విద్యార్థులు

కాకినాడ రూరల్, మార్చి 15: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ఈనెల 18 నుంచి 30వ తేదీ వరకూ జరుగుతాయని కాకినాడ జిల్లా డీఈవో పిల్లి రమేష్ తెలిపారు. కాకినాడ డీఈవో కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆర్జేడీ జి.నాగమణి, డీఈవో రమేష్ పదో తరగతి పరీక్షలు, సార్వత్రిక విద్య పది, ఇంటర్ పరీక్షల నిర్వహణకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. కాకినాడ జిల్లాలో మొత్తం 32,262మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారని 137 పరీక్షా కేంద్రాలను జిల్లాలో ఏర్పాటు చేశామన్నారు. సాంకేతిక పరిజ్ఞానంతో పదోతరగతి ప్రశ్నాపత్రాలను రాష్ట్రప్రభుత్వ పరీక్షల విభాగం రూపొందించిందని, దీంతో ఎవరైనా లీక్ చేస్తే ఆ ప్రశ్నాపత్రం ఎక్కడినుంచి వచ్చింది, ఏ జిల్లా, ఏ గ్రామం, కేంద్రం, పరీక్ష గది చివరకు ఏ విద్యార్థికి సంబంధించినది అనేది కూడా తెలిసిపోతుందన్నారు. రెగ్యులర్ విద్యార్థులు 27,856మంది, రీఅప్పియర్ విద్యార్థులు 4,374 మంది, ఓఎస్ఎస్‌సీలో రెగ్యులర్ 25, రీఅప్పియర్ విద్యార్థులు ఏడుగురు ఉన్నారని తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేశామని కొన్ని అనివార్య కారణాలవల్ల పరీక్ష ప్రారంభ సమయంకంటే అర్ధగంట ఆలస్యమైనా పరీక్ష రాసేందుకు అనుమతిస్తామన్నారు. మొత్తం ఏడు పేపర్లకు పరీక్షలుంటాయని, మొత్తం 600 మార్కులకు పరీక్షలు జరుగుతాయని చెప్పారు. పరీక్షలను పర్యవేక్షించేందుకు ఆరుగురు ఫ్లయింగ్, 28 సిట్టింగ్ స్క్వాడ్లను ఏర్పాటు చేసినట్లు డీఈవో తెలిపారు.



మాట్లాడుతున్న డీఈవో రమేష్, ఆర్జేడీ నాగమణి

సార్వత్రిక విద్య పరీక్షలు కూడా..

సార్వత్రిక విద్యకు సంబంధించిన పరీక్షలు కూడా సోమవారంనుంచి ప్రారంభం కానున్నాయని పాఠశాల విద్య ఆర్జేడీ జి.నాగమణి తెలిపారు. ఓపెన్ స్కూల్ పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలు ఈనెల 18నుంచి 27వరకూ జరుగుతాయన్నారు. పదో తరగతి పరీక్షలకు కాకినాడ జిల్లాలో 2,067మంది విద్యార్థులు హాజరుకానున్నారని, వీటికోసం ఏడు పరీక్షాకేంద్రాలను కేటాయించామని తెలిపారు. ఇంటర్ పరీక్షలకు జిల్లాలో 6,494 మంది విద్యార్థులు హాజరుకానున్నారని, వాటి నిర్వహణకు సంబంధించి 20 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. పరీక్షలు మధ్యాహ్నం 2.30 గంటలనుంచి సాయంత్రం 5.30 గంటల వరకూ జరుగుతాయని తెలిపారు. సమావేశంలో ఏసీఈ రాజశేఖర్, డీవైఈవో డేనియల్ రాజు, ఓపెన్ స్కూల్ జిల్లా సమన్వయకర్త పి.సాయివెంకటరమణ పాల్గొన్నారు.

కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయాలి

- జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా

కలెక్టరేట్(కాకినాడ), మార్చి 15: జిల్లాలో ఉన్న ప్రతి నియోజకవర్గంలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయాలని కలెక్టర్ కృతికాశుక్లా ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం ఆమె ఆర్వోలు, వివిధ టీమ్ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో సమన్వయంతో పనిచేయడానికి, ఫిర్యాదులను వేగంగా స్వీకరించడానికి కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయాలన్నారు. ప్రధానంగా మోడల్‌కోడ్ ఉల్లంఘన, ఓటర్ల సమస్యలపై వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన వెంటనే ప్రభుత్వ కార్యాలయాల్లో రాజకీయ నాయకులు ఫొటోలు తొలగించాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఫొటోలు, బ్యానర్లను 24 గంటల్లో, పబ్లిక్ ప్రాంతాల్లో ఉన్న బ్యానర్లను 48 గంటల్లో తొలగించాలన్నారు. లౌడ్ స్పీకర్లను రాత్రి పది గంటల తర్వాత అనుమతించకూడదన్నారు. మోడల్ కోడ్ ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో బృందాలు విచారణ చేపట్టాలన్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి ఐడీ కార్డులు జారీ చేయాలన్నారు. ఎన్నికల ఫిర్యాదులకోసం ఏర్పాటు చేసిన ఓటరు సహాయ కేంద్రం, సీవిజిల్, 1950 కాల్‌సెంటర్‌కు వచ్చే ఫిర్యాదులను పరిష్కరించాలన్నారు. జేసీ రామ్‌సుందర్‌రెడ్డి, డీఆర్వో తిప్పేనాయక్ పాల్గొన్నారు.

ఆయుధాలు పోలీస్‌స్టేషన్‌లో అందజేయాలి: కలెక్టర్



కలెక్టరేట్(కాకినాడ), మార్చి 15: సార్వత్రిక ఎన్నికలు ముగిసేవరకు ఆయుధ లైసెన్సులు కలిగిన వ్యక్తులు తమ ఆయుధాలను పోలీస్‌స్టేషన్‌లో డిపాజిట్ చేయాలని కలెక్టర్ కృతికాశుక్లా ఆదేశించారు. శుక్రవారం ఆమె చాంబర్‌లో ఆయుధ స్క్రూటినీ సమావేశం జరిగింది. జిల్లా కలెక్టర్ కృతికాశుక్లా, ఎస్పీ సతీష్ కుమార్‌లతో కూడిన ద్విసభ్య కమిటీ సమీక్షించింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆయుధ డిపాజిట్ మినహాయింపు కోరుతూ జిల్లావ్యాప్తంగా 39 దరఖాస్తులు వచ్చాయన్నారు. దీనిలో 32 దరఖాస్తులకు కమిటీ మినహాయింపు ఇచ్చిందన్నారు. డీఆర్‌వో తిప్పే నాయక్ పాల్గొన్నారు.

గ్రూప్-1 పరీక్షలు సజావుగా నిర్వహించాలి

- జిల్లా రెవెన్యూ అధికారి తిప్పేనాయక్

కలెక్టరేట్(కాకినాడ), మార్చి 15: ఈనెల 17న జిల్లాలో జరిగే గ్రూప్-1 పరీక్షలను సజావుగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి తిప్పేనాయక్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో గ్రూప్-1 పరీక్షల నిర్వహణపై నియమితులైన లైజాన్ అధికారులు, సూపరింటెండెంట్‌లతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 17న జరిగే గ్రూప్-1 పరీక్షలకు జిల్లాలో 6,843మంది అభ్యర్థులు హాజరవుతారన్నారు. దీనికోసం సూరంపాలెం ఆదిత్య విద్యాసంస్థల్లో 11 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారన్నారు. పరీక్ష కేంద్రాలకు కావాల్సిన అన్ని సదుపాయాలను చీఫ్ సూపరింటెండెంట్లు ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో ఏపీపీఎస్సీ అసిస్టెంట్ కార్యదర్శి వసంత్‌కుమార్, వ్యవసాయశాఖ జేడీ విజయ్‌కుమార్, పశుసంవర్ధక శాఖ జేడీ సూర్యప్రకాష్‌రావు, డ్వామా పీడీ వెంకటలక్ష్మీ పాల్గొన్నారు.

డ్వాక్రా మహిళలకు చీరల పంపిణీ

- కాకినాడ నగరంలో ఎమ్మెల్యే ద్వారంపూడి ప్రలోభాలు

కార్పొరేషన్(కాకినాడ), మార్చి 15: ఎన్నికల నేపథ్యంలో కాకినాడ నగరంలో అధికార వైసీపీ నేతలు ప్రలోభాలకు తెరలేపారు. రెండురోజులక్రితం ప్రభుత్వ, కార్పొరేషన్ ఉద్యోగులతో కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేసి భోజనం పెట్టి మచ్చిక చేసుకునే ప్రయత్నం చేశారు. గురువారం రాత్రి ఆయన డ్వాక్రా మహిళలతో సమావేశం ఏర్పాటు చేసి చీరలు పంచారు. 200మంది డ్వాక్రా మహిళలు ఈ సమావేశానికి హాజరయ్యారు. సమావేశం తర్వాత మహిళలు చీరలు పట్టుకుని సినిమా రోడ్‌లో నడుచుకుని వెళ్లారు. సాధారణంగా పోలింగ్‌కు ఒకటి రెండు రోజుల ముందు ఓటర్లకు తాయిలాలు పంచుతుంటారు. కానీ వైసీపీ ఆవిర్భావం తర్వాత తాయిలాలు పంపిణీ విధానంలో ముందస్తు ప్రలోభాలకు ఒడిగడుతోంది. ఎన్నికల సమయంలో తాయిలాల పంపిణీ ప్రహసనంతో కూడుకోవంతో చాలా ముందుగానే ఒక్కొక్క వర్గాన్ని తమకు చేరువ చేసుకునే పనిలో వైసీపీ నేతలు పడ్డారు. ఈ క్రమంలో ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందే డ్వాక్రా మహిళలకు చీరలు పంపిణీ చేయడం చర్చనీయాంశంగా మారింది.

నవ్విపోదురుగాక నాకేటి..

- అసంపూర్తి పనులకు నేడు మంత్రి ప్రారంభోత్సవం
- ఎన్నికల కోడ్ వచ్చేస్తుందని కంగారుగా శిలాఫలకంపై పేరుకోసం తాపత్రయం
- ప్రధాని ప్రారంభించిన పనులు మళ్లీ ప్రారంభిస్తానన్న మంత్రి
- వారించిన కమిషనర్ కార్యాలయం

అన్నవరం, మార్చి 15: రాష్ట్రంలో వైసీపీ నాయకులు వ్యవహరిస్తున్న తీరు ఇప్పటికే ముక్కున వేలేసుకునేలా ఉంటుండగా తాజాగా ఓ మంత్రి శిలాఫలకంపై పేరుకోసం అసంపూర్తిగా ఉన్న పనులను ప్రారంభించడానికి సన్నద్ధమయ్యారు. నవ్విపోదురు గాక నాకేటి.. అన్నట్టుగా వ్యవహరిస్తున్న ఆయన ఎవరో కాదు దేవదాయశాఖ మంత్రి. జాతీయ రహదారిపై రాజమహేంద్రవరం వైపు వెళ్లే భక్తులకోసం రూ.3.50కోట్లతో నమూనాలయం నిర్మిస్తున్నారు. ఈ పనులు 50శాతం కూడా పూర్తికాలేదు. ఒకట్రెండురోజుల్లో ఎన్నికల కోడ్ వస్తుండడంతో ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలకు బ్రేక్ పడనుంది. దీంతో మంత్రి ఆగమేఘాలపై ప్రారంభోత్సవం చేపడతానని తెలపడంతో అధికారులు ఆశ్చర్యపోయారు. చేసేది ఏమీ లేక ప్రారంభోత్సవానికి సిద్ధమయ్యారు. నమూనాలయం పూర్తి కాకపోవడంతో దానికి ప్రసాదం కౌంటర్ ప్రారంభోత్సవంగా కలరింగ్ ఇవ్వాలని మంత్రి కార్యాలయం పేర్కొనడం విశేషం. రెండురోజులుగా ప్రసాదం కౌంటర్ పనులు హడావుడిగా చేపడుతున్నారు. మరోపక్క ఇటీవల కేంద్ర ప్రభుత్వ పథకం ప్రసాద్ స్కీం నిధులు రూ.20కోట్లు మంజూరవగా ఆ పనులను దేశ ప్రధాని నరేంద్ర మోదీ జమ్మూకాశ్మీర్‌నుంచి వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. వీటిని మరోసారి శంకుస్థాపన చేస్తానని మంత్రి తెలపడంతో దేవదాయ కమిషనర్ కార్యాలయం వారించింది. అక్కడ శిలాఫలకంపై తమరి పేరు ఉందని మరోసారి ప్రారంభిస్తే ఇబ్బందులు వస్తాయని తెలపడంతో కనీసం కొబ్బరికాయ కొట్టి వెళ్తానని పేర్కొనడంతో ఆ దిశగా ఏర్పాట్లు చేయాలని కమిషనర్ కార్యాలయంనుంచి అన్నవరం అధికారులకు మౌఖిక ఆదేశాలు వచ్చినట్లు విశ్వసనీయ సమాచారం. దీంతో ప్రసాద్ స్కీం నిధులతో నిర్మించే అన్నదానభవనంవద్ద మంత్రి టెంకాయి కొట్టేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. శిలాఫలకాలపై పేరుకోసం ఈ హడావిడి పనులు చేపట్టడంవల్ల నాణ్యతా లోపం ఉంటుందని భక్తుల సౌకర్యాల కోసం దీర్ఘకాలిక ఉపయోగ పనులు చేపట్టాల్సింది పోయి పేరుకోసం హడావిడి పనులేమిటని పలువురు భక్తులు ప్రశ్నిస్తున్నారు.



అసంపూర్తిగా ఉన్న సత్యదేవుడి నమూనాలయ నిర్మాణం

టీడీపీని వీడే ప్రసక్తే లేదు

- జనాలను తప్పుదోవ పట్టించేందుకు వైసీపీ కుట్ర
- దివ్య గెలుపునకు అహర్నిశలు శ్రమిస్తాం
- రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ యనమల కృష్ణుడు

తుని రూరల్, మార్చి 15: మాజీమంత్రి యనమల రామకృష్ణుడి సోదరుడు టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ యనమల కృష్ణుడు పార్టీ మారుతున్నారన్న వార్తలు వైసీపీ అనుకూల మీడియాలో చక్కర్లు కొట్టడంతో పెద్ద దుమారమే రేగింది. దీంతో యనమలకృష్ణుడు తునిలో విలేఖరుల సమావేశం ఏర్పాటు చేసి తాను ఏ పార్టీలోను చేరలేదని, కావాలనే దుష్ప్రచారం చేస్తున్నారని కుండబద్దలు కొట్టారు. పార్టీ ఆవిర్భావం నుంచి టీడీపీలో కొనసాగుతూ తన అన్న యనమల రామకృష్ణుడి ఉన్నతికి ఎంతో శ్రమించానన్నారు. ఇప్పుడు తుని అభ్యర్థి దివ్య గెలుపునకు పనిచేస్తానని స్పష్టం చేశారు. ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు వైసీపీకి మీడియా దుష్ప్రచారానికి పాల్పడుతోందన్నారు.



ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక స్పందనలో అర్జీలు

కలెక్టరేట్(కాకినాడ), మార్చి 15: జిల్లా కలెక్టరేట్ స్పందన హాలులో ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక స్పందన కార్యక్రమం శుక్రవారం జరిగింది. డీఆర్వో తిప్పేనాయక్, జిల్లా గృహ నిర్మాణశాఖ అధికారి సత్యనారాయణ ఆధ్వర్యంలో ప్రజలనుంచి అర్జీలు స్వీకరించారు. మొత్తం 14 అర్జీలు స్వీకరించగా వాటి పరిష్కారం నిమిత్తం ఆయా శాఖల అధికారులకు పంపించారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం నిర్వహించిన కార్యక్రమంలో నాలుగు అర్జీలు స్వీకరించారు.

జేఎన్‌టీయూకేలో సాంకేతిక నైపుణ్య విజ్ఞాన సదస్సు

జేఎన్టీయూకే, మార్చి 15: కాకినాడ జేఎన్టీయూకే మెకానికల్ విభాగంలో రెండురోజులపాటు నిర్వహించే సాంకేతిక నైపుణ్య విజ్ఞాన సదస్సును శుక్రవారం ప్రారంభించారు. టార్క్ 24 పేరుతో నిర్వహించే ఈ సదస్సును యూసీఈకే ప్రిన్సిపాల్ ఎంహెచ్ఎం కృష్ణప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఈ సదస్సును సద్వినియోగం చేసుకోవాలన్నారు. మొదటిరోజు నిర్వహించిన కార్యక్రమంలో రోబోటిక్స్‌లో 43మంది విద్యార్థులు, డ్రోన్ శిక్షణలో 41మంది, సీఎన్‌సీలో 8మంది విద్యార్థులు తమ ప్రతిభా పాటవాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో మెకానికల్ విభాగాధిపతి డాక్టర్ డి.లింగరాజు, వైస్ ప్రిన్సిపాల్ రత్నకుమారి, డాక్టర్ వరప్రసాద్, మధుసూదన్ ప్రసాద్, డాక్టర్ బి.బాలకృష్ణ, డాక్టర్ మీరాసాహెబ్ పాల్గొన్నారు.

చెందుర్తిలో మహిళ దారుణహత్య - 7లో

సామర్లకోటలో పీడీఎస్ బియ్యం లారీపై విజిలెన్స్ దాడులు - 7లో

రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ విశ్రాంత జేడీ మృతి - 7లో

దేవదానం రాజుకు తెలుగు విశ్వవిద్యాలయం కీర్తి పురస్కారం - 7లో

ఉత్తర్వులు గాలికే!!!

- దగా పడిన అంగన్‌వాడీలు

తుని రూరల్, మార్చి 15: అరకొర వేతలతో బతుకులు ఈడిస్తున్న అంగన్‌వాడీలు వైసీపీ సర్కారు చేతిలో దగాపడ్డారు. గడిచిన ఐదేళ్ల కాలంలో ఏశాఖ ఉద్యోగులు చేయని రీతిలో 42 రోజులు నిరవధిక సమ్మె చేసి రికార్డు సృష్టించారు. దీంతో ప్రభుత్వం డిమాండ్లు అన్నీ పరిష్కరిస్తామని ఇదిగో అమలు జీవోలు అంటూ నయా మోసపు హామీలతో ఉధృతంగా సాగుతున్న ఉద్యమాన్ని నీరుగార్చింది. దీంతో వీరంతా విధుల్లో చేరి 50రోజులు గడుస్తున్నా ఏ జీవో అమలుకు నోచుకోలేదు. అనేక డిమాండ్లపై ఏ ఉత్తర్వులు ఇప్పటికీ వెలువడలేదు. సమ్మెకాలానికి వేతనం ఇస్తామన్న హామీ సైతం మరుగున పడింది. జీవోలు అమలుకు మరోసారి ఉద్యమం అంటూ అంగన్‌వాడీ సంఘం తేల్చిచెప్పినా ప్రయోజనం లేకపోయింది. త్వరలో సార్వత్రిక ఎన్నికల నియామావళి అమల్లోకి రానున్నండంతో వారి సమస్యల పరిష్కారం అటకెక్కి దయనీయ పరిస్థితులు నెలకొన్నాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 4వేలు పైబడి అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా ఇందులో కార్యకర్తలు, సహాయకులు 10వేలమంది వరకు పనిచేస్తున్నారు. 11 డిమాండ్ల సాధన కోసం గతేడాది డిసెంబరు 12 నుంచి జనవరి 21 వరకు నిరవధిక సమ్మె చేపట్టారు. ఎస్మా వంటి చట్టాలకు భయపడలేదు. తుదికి ఉద్యోగాల నుంచి తొలగిస్తామంటూ వైసీపీ ప్రభుత్వం బెదిరింపులకు దిగడంతో వేరే గత్యంతరం లేని పరిస్థితుల్లో వారంతా విధుల్లోకి చేరారు. డిమాండ్ల పరిష్కారం ఎక్కడ వేసిన గొంగలి అక్కడ అన్న చందాన మిగిలింది. సమ్మె కాలానికి చెల్లిస్తామన్న వేతనం సైతం అందలేదంటూ అంగన్‌వాడీలు వాపోతున్నారు.

- **జీవోలు అమలు ఎప్పుడు**

రాష్ట్రవ్యాప్తంగా నిరసనలో భాగంగా 11 డిమాండ్ల సాధన కోసం ఉద్యమించారు. ప్రభుత్వంలో జరిగిన చర్చల్లో భాగంగా మూడేళ్లుగా పేరుకుపోయిన టీఏ, డీఏ బకాయిలు చెల్లిస్తామని జీవో ఇచ్చారు. పదవీ విరమణ ప్రయోజనాన్ని రూ.1.2లక్షలకు పెంచాతామన్న సవరణ ఉత్తర్వు రాలేదు. ఆయాలకు 45నుంచి 50 ఏళ్లకు పదోన్నతిపై ఉత్తర్వులు, పదవీ విరమణ వయస్సు 62ఏళ్లకు పెంచుతూ ఉత్తర్వులు జారీ అయినా అమలుకు నోచుకోలేదు. మినీ కార్యకర్తలను మెయిన్ కార్యకర్తలుగా మార్పు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపు, మట్టి ఖర్చులకు రూ.20వేలు చెల్లింపు వంటి వాటిపై ఎలాంటి ఉత్తర్వులు రాలేదు. కీలకమైన వేతనం పెంపు, గ్రాట్యుటీ వంటి డిమాండ్లపై ప్రభుత్వం నోరు మెదపడం లేదు.



జనవరిలో జరిగిన సమ్మెలో కార్యకర్తలను నిర్బంధిస్తున్న పోలీసులు



వాడపల్లి వెంకన్న ఆలయంలో ప్రతిష్ఠించనున్న శిఖరాలు

వాడపల్లి వెంకన్న ఆలయంలో నేడు, రేపు
స్వర్ణ శిఖర ప్రతిష్ఠా మహోత్సవాలు

ఆత్రేయపురం, మార్చి15: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వర్ణ శిఖర ప్రతిష్ఠను ఖండవల్లి వరప్రసాదాచార్యులు బ్రహ్మత్వంలో వేదపండితులు శని, ఆదివారాల్లో ఘనంగా నిర్వ హించనున్నారు. వేంకటేశ్వరస్వామి, క్షేత్ర పాలకుడు గోపాలస్వామి, మహాలక్ష్మి అమ్మవారు, అన్నపూర్ణా సమేత విశ్వేశ్వరస్వామి ఆలయాలకు స్వర్ణ శిఖరాలను ఎమ్మెల్యే జగ్గిరెడ్డి సహకారంతో దాతల విరాళాలు రూ.35 లక్షలతో చేయించారు. మహోత్సవానికి ఏర్పాట్లుచేసినట్టు ఆలయ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈవో భూపతిరాజు కిషోర్‌కుమార్ తెలిపారు.

దేవదానం రాజుకు తెలుగు విశ్వవిద్యాలయం కీర్తి పురస్కారం



యానాం, మార్చి15: కవి, కథకుడు, బహుగ్రంథకర్త దాట్లదేవదానం రాజుకు సృజనాత్మక సాహిత్యం విభాగంలో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం కీర్తి పురస్కారాన్ని ప్రకటించింది. తెలుగు విశ్వవిద్యాలయం వైస్‌చాన్సలర్ టి.కిషన్‌రావు ఈ మేరకు ప్రకటన జారీచేశారు. ఈనెల 20వ తేదీ మధ్యాహ్నం 2.30 గంటలకు హైదరాబాదు విశ్వవిద్యాలయం ప్రాంగణంలో జరిగే సభలో దేవదానం రాజు ఈ పురస్కారాన్ని స్వీకరిస్తారు. కథలు, కవితలు, చరిత్ర, విమర్శ మొదలైన సాహిత్య ప్రక్రియల్లో చేసిన సాహిత్య కృషిని పరిగణలోకి తీసుకుని ఇస్తున్న పురస్కారం గర్వకారణంగా ఉందని, అదీ సప్తతి పుట్టినరోజున ప్రతిష్ఠాత్మకమైన తెలుగు విశ్వవిద్యాలయం పురస్కారాన్ని స్వీకరించడం మరింత సంతోషంగా ఉందని దాట్ల అన్నారు. ఏడు కవితా సంపుటాలు, ఐదు కథా సంపుటాలు, రెండు దీర్ఘకవితలు, చరిత్ర గ్రంథం, నవల, రాజకీయ వ్యంగ్య కథన చమత్కారాలు వంటి పుస్తకాలను వెలువరించడం జరిగిందన్నారు. ఫ్రెంచ్, తమిళం, మలయాళం, కన్నడ, హిందీ, ఇంగ్లీషు భాషల్లోకి అనేక కథలు, కవితలు అనువాదం అయ్యాయన్నారు. కాగా దేవదానంరాజు గతంలో కళైమామణి, తెలుగురత్న, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు, మధుశ్రీ, కథ గౌరవం, డాక్టర్ పరుచూరి పురస్కారం, కుందుర్తి శతజయంతి ఫ్రీవర్స్ ఫ్రంట్ పురస్కారం వంటివి అందుకున్నారు. ఇప్పుడు కీర్తి పురస్కారానికి ఎంపికైన దేవదానంరాజుకు ప్రముఖ కవులు, సాహివేత్తలు కళైమామణి విష్ణుమూర్తి, శిఖామణి, పీఆర్‌ఎల్ స్వామి, మధునాపంతుల సత్యనారాయణమూర్తి, ముమ్మిడి నాగప్రసాద్, చింతా కొండలరావు, జిమ్మి, రామ్మోహనరావు, డాక్టర్ శివప్రసాద్ తదితరులు ప్రత్యేక అభినందనలు తెలిపారు.



మొసలపల్లి వద్ద లారీ బోల్తాపడిన దృశ్యం

రొయ్యలమేత లోడు లారీ బోల్తా

అంబాజీపేట, మార్చి 15: రొయ్యల లోడుతో వెళ్తున్న వ్యాన్ అదుపు తప్పి మొసలపల్లి ప్రధాన రహదారిలో బోల్తాపడింది. కొవ్వూరు నుంచి అమలాపురం వైపు రొయ్యల మేతతో వెళ్తున్న వ్యాను ముక్కామల- ఈదరపల్లి రోడ్డులో మొసలపల్లి దగ్గరకు వచ్చేసరికి అదుపుతప్పి పక్కనున్న గోతులో బోల్తాపడింది. అయితే వ్యానులో ప్రయాణిస్తున్న డ్రైవర్‌తోపాటు మరొకరు సురక్షితంగా బయటపడ్డారు. నిత్యం రద్దీగా ఉంటే ఈ ప్రాంతంలో ప్రమాదం జరిగిన సమయంలో ఎవ్వరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. దీనిపై ఏ విధమైన కేసు నమోదు కాలేదు.



తాడేపల్లిలో ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో శుక్రవారం సీఎం జగన్ సమక్షంలో వైసీపీలో చేరిన కాపు నాయకుడు ముద్రగడ పద్మనాభం, ఆయన తనయుడు గిరి

జిల్లా బీసీ సంక్షేమ సాధికారతాధికారిగా లల్లి

కలెక్టరేట్(కాకినాడ), మార్చి 15: కాకినాడ జిల్లా బీసీ సంక్షేమ సాధికారతాధికారిగా ఎం.లల్లి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆమె జిల్లా కలెక్టర్ కృతికాశుక్లాను కలిశారు.



హుకుంపేటలో జరిగిన జయహో బీసీ సభలో మాట్లాడుతున్న మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు, గోరంట్ల తదితరులు

99 శాతం పనులు పూర్తి చేశావా ?

- ఏదీ.. ఎక్కడ.. సిగ్గు లేదూ..
- కడప పులివి కాదు.. పిల్లివి
- జయహో బీసీ సభలో జగన్‌పై మండిపడ్డ మాజీ మంత్రి అయ్యన్న, ఎమ్మెల్యే గోరంట్ల

రాజమహేంద్రవరంసిటీ/రూరల్/కడియం మార్చి15: ఏటి? రాష్ట్రంలో 99 శాతం పనులు పూర్తి చేశావా? ఏది ఎక్కడా కనబడుట లేదు. సిగ్గులేదా జగన్ నీకు ఆ మాట అనడానికి.. నువ్వు దగా కోరువి. నువ్వు కడప పులివి కాదు.. పిల్లివి.. అందుకే నీవంటే గౌరవం లేదు అని మాజీ మంత్రి టీడీపీ సీనియర్ నేత చింతకాయల అయ్యన్నపాత్రుడు మండిపడ్డారు. రాజమహేంద్రవరం రూరల్ మండలం హుకుంపేట గ్రామం జాతీయ రహదారి పక్కన మైదానంలో శుక్రవారం రాత్రి టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి ఆధ్వర్యంలో జరిగిన జయహో బీసీ సభలో ఆయన మాట్లాడారు. నాపై 16 కేసులు పెట్టావు? నువ్వు చేసిన తప్పులను ప్రశ్నించినందుకు సీఐడీ ప్రయోగించావు. ఏం పీకారు అన్నారు. అసలు రాష్ట్రానికి ఏమి చేశావు జగన్? ఓ పోలవరం చేశావా? ప్రత్యేకహోదా తెచ్చావా? పరిశ్రమలు తెచ్చావా? నిరుద్యోగ సమస్య తీర్చావా? ఏమి చేశావని నీకు ఓటెయ్యాలో చెప్పు అన్నారు. ఏదీ ఇప్పుడు రాష్ట్రంలో పాదయాత్ర చేయి చూద్దాం... జనాలు తరిమేత్తారు మిమ్మల్ని. అమ్మలారా.. అయ్యలారా మీ పెన్షన్ జగన్ నొక్కేశాడు. మీకు తెలియడం లేదు. రూ.3 వేలు పెంచుతానని చెప్పాడు. రూ.250 చొప్పున పెంచుకువచ్చాడు. ఇలా పెంచడం వల్ల మీకు జరిగిన నష్టం ఎంతో తెలుసా? ఒక్కొక్క పెన్షన్‌దారుడు రూ.27,500 నష్టపోయాడు. ఇలా చాలా ఉన్నాయి... ప్రజలారా మేల్కొండి. ఇలా నమ్మితే మొత్తం ఆస్తులన్నీ పోగొట్టుకోవాల్సిన పరిస్థితి వస్తుందన్నారు. రాష్ట్రంలో ప్రజలతోపాటు ఈ దుర్మార్గుడు ఉద్యోగులను మోసం చేశాడు. 60 లక్షల మంది ఉద్యోగులు ఇతని వల్ల మోసపోయారు. సీపీఎస్ రద్దన్నాడు. చేతులెత్తేశాడు. పోలీసులకు కూడా చెబుతున్నాం. తొత్తులుగా మారొద్దు. ఆలోచించుకోండి. చంద్రబాబు సీఎం అయితే రాష్ట్రం బాగుపడుతుంది. 140 బీసీ కులాలకు లబ్ధి చేకూరుతుంది అన్నారు.

చీరలొద్దు.. చేతనైతే విద్యుత్ చార్జీలు తగ్గించండి!

సబ్‌స్టేషన్‌లోకి వైసీపీ చీరలు విసిరిగొట్టి మహిళల ధర్నా

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 15: రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్‌కు చేతనైతే విద్యుత్ చార్జీలు తగ్గించాలేతప్ప చీరలు పంచడం కాదని మహిళలు ఎద్దేవా చేశారు. రాజమహేంద్రవరం 30వ డివిజన్‌కు చెందిన మహిళలు జాంపేట విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఎంపీ భరత్‌రామ్ ఇచ్చిన చీరలతో నిరసన ప్రదర్శన, ధర్నా చేశారు. ఈ ఆందోళనకు టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్ మద్దతు ప్రకటించి మాట్లాడారు. ఉన్నట్టుండి ఎందుకు భరత్‌రామ్ మహిళలపై నీకు అంత అభిమానం పుట్టుకొచ్చిందని ప్రశ్నించారు. చీరలు సారెలు పెట్టి ఓట్లకు గేలం వేయాలని చూస్తున్నావుకానీ నీ చర్యను మహిళలంతా అసహ్యించుకుంటున్నారన్నారు. టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అధికారంలోకి రావడం ఖాయమని అప్పుడు ప్రజలందరికీ న్యాయం జరుగుతుందన్నారు. అనంతరం మహిళలు ఎంపీ ఇచ్చిన చీరలను సబ్‌స్టేషన్‌లోకి విసిరికొట్టారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నగర అధ్యక్షుడు రెడ్డి మణి, డివిజన్ అధ్యక్షుడు ఎరక కొండ, నాయకులు కిష్టాపర్, టిల్లు, తుత్తరపూడి రమణ, నరాల రమణమూర్తి, చాపల చిన్నరాజు, తెలుగు మహిళా నగర అధ్యక్షురాలు కోసూరి చండీప్రియ, రెల్లా సత్తిబాబు, ఈపి కిషోర్, తుళ్లి పద్మ పాల్గొన్నారు.



జాంపేట సబ్‌స్టేషన్ వద్ద ధర్నా చేస్తున్న మహిళలు.. మద్దతు తెలుపుతున్న ఆదిరెడ్డి వాసు

చంద్రబాబు ముందుకు రంప టికెట్ పంచాయితీ

నియోజకవర్గ పరిస్థితులను వివరించిన మాజీ ఎమ్మెల్యేలు శీతంశెట్టి, వంతల

చంద్రబాబు నివాసం వద్ద వంతలకు అనుకూలంగా ఆందోళన చేసిన ఆమె కేడర్



చంద్రబాబు నివాసం వద్ద రంపచోడవరం టీడీపీ శ్రేణులు ఆందోళన చేస్తున్న దృశ్యం

రంపచోడవరం, మార్చి15: రంపచోడవరం నియోజకవర్గ టీడీపీ టికెట్ మిరియాల శిరీషకు ఖరారు చేసిన అనంతరం ఆమెను వ్యతిరేకిస్తూ నియోజకవర్గ తాజా మాజీ ఇన్‌చార్జి వంతల రాజేశ్వరి, మాజీ ఎమ్మెల్యే శీతంశెట్టి వెంకటేశ్వరరావు, మహిళా నాయకురాలు గొర్లె సునీత, వారి అనుచరవర్గం శుక్రవారం చంద్రబాబును కలిసి పరిస్థితిని వివరించారు. గురువారం నుంచి రంపచోడవరంలో నియోజకవర్గ ఇన్‌చార్జి వంతల శిబిరంలో ఆమెకు మద్దతుగా నాయకులు, కార్యకర్తలు ఆందోళనకు దిగారు. అలాగే శుక్రవారం ఉదయం పెద్దఎత్తున వాహనాల్లో నాయకులు ఉండవల్లిలోని చంద్రబాబు నివాసానికి చేరుకున్నారు. చంద్రబాబు నివాసం ముందు నాయకులు, కార్యకర్తలు వంతలకు అనుకూలంగా నినాదాలు చేశారు. ఈలోగా తాము కలిసి పరిస్థితిని వివరించాలనుకుంటున్నామని శీతంశెట్టి, రాజేశ్వరిలు చంద్రబాబు వద్దకు కబురుపంపగా నలుగురికి అవకాశం ఇచ్చారు. బాబును కలిసిన శీతంశెట్టి, రాజేశ్వరి, గొర్లె సునీత, శివాజీలు రంప టికెట్‌ను మార్చాల్సి ఉన్నదని కోరారు. కాగా అన్ని సర్వేలు చేసి టికెట్‌ను ఖరారు చేశామని చంద్రబాబు వివరించగా, ఇప్పుడు టికెట్ మార్చకుంటే పార్టీ దెబ్బతింటుందని చెప్పగా పరిశీలిస్తామని బాబు హామీ ఇచ్చారని నలుగురు నాయకులు మీడియాకు చెప్పారు.



టీ దోమ ఆశించడంతో మాడిపోయిన జీడిమామిడి తోట

ఏమిటీ కష్టం!

- జీడిమామిడికి ఆశిస్తున్న టీ దోమ
- ముందే గుర్తించిన ఉద్యానశాఖాధికారులు
- మాడిపోతున్న పూత
- పిందె దశలో రాలిపోతున్న పిక్కలు
- అప్రమత్తమైన అధికారులు
- నివారణా చర్యలు చేపట్టకపోతే దిగుబడులపై ప్రభావం
- తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన
- ఆందోళన చెందుతున్న జీడిమామిడి రైతులు



టీ దోమ

పెద్దాపురం, మార్చి 15: జీడిమామిడి ఉద్యాన వాణిజ్య పంటల్లో ప్రధానమైనది. డ్రైఫ్రూట్ పంటల్లో అధికంగా తినబడే జీడిపప్పు పంట చేతికి రావాలంటే చాలా పురుగుల దాడులు తట్టుకోవాలి. ఇందులో జీడిమామిడికి కాండం, వేరు తొలిచే పురుగు తర్వాత అధిక నష్టం కలిగించేది తేయాకు దోమ (టి దోమ). ఇది నిజంగా దోమకాదు. కూర్చున్నప్పుడు దీని శరీర నిర్మాణం దోమలాగ ఉండడం, తేయాకు తోటల్లో ఎక్కువగా కనిపించడం వల్ల దీన్ని తేయాకు దోమ అని పిలుస్తుంటారు.

జిల్లావ్యాప్తంగా 11,335 హెక్టార్లల్లో సాగు

జీడిమామిడి సాగు కాకినాడ జిల్లావ్యాప్తంగా 11,335 హెక్టార్లల్లో విస్తరించి ఉంది. జీడిమామిడి సాగులో టీ దోమ అక్టోబరు నుంచి ఏప్రిల్ నెలల్లో అక్కడక్కడా కనిపిస్తుంది. ఈ టీ దోమ పూతదశ నుంచి పంట చేతికందే వరకూ కనిపిస్తుంది. లేత ఆకులు, పూతలు మాడిపోతాయి. పక్వానికి రాని గింజలు ముందుగానే రాలిపోతాయి. గింజలపై మచ్చలు చారలు ఏర్పడి నాసిరకంగా తయారవుతయాయి. ఈ టీదోమ ప్రభావం కారణంగా చెట్టు పాలిపోయినట్లుగా కనిపిస్తుంది. ఈ దోమ చిరు దశలోను తల్లిదశలోనూ లేత కొమ్మలు పైన రెమ్మలు పైన వాలి వాటి రసాన్ని పీల్చడం వల్ల ఎర్రని జిగురులాంటి పదార్థం కారుతూ నల్లని చారలు ఏర్పడతాయి. ఇలా టీ దోమ తోటల్లో గుర్తించవచ్చని అధికారులు చెబుతున్నారు.

మూడు దశల్లో సస్యరక్షణ చర్యలు

టీ దోమ నివారణకు మూడు దశల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. మొదటిది చిగురాకు దశ, ఈ దశ అక్టోబరు నుంచి నవంబరు నెలల్లో కనిపిస్తుంది. రెండవది పూత దశ ఇది డిసెంబరు నుంచి జనవరి నెలల్లో కనిపిస్తుంది. మూడోది గింజకట్టే దశ. ఇది ఫిబ్రవరి నుంచి మార్చి నెలల్లో కనిపిస్తుంది. ఈ మూడు దశల్లోనూ సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఉద్యానశాఖాధికారులు సూచిస్తున్నారు.

నివారణ ఇలా...

జీడిమామిడి తోటల్లో పూతదశ ప్రారంభమయ్యింది. పూతదశలోనే తేయాకు దోమ (టీ దోమ)ను అధికారులు గుర్తించారు. ఈ దశలోనే దీనిని నియంత్రించాలని అందుకు అనుగుణంగా అధికారులు చర్యలు చేపట్టారు. టీ దోమ నివారణకు ఎల్..సైహాలోత్రిన్, ఎసిటామిప్రిడ్ థయామీ థాక్సమ్ మందులను తగు మోతాదులో పిచికారీ చేసుకోవాలి, లేదా ప్రొఫినోఫాస్ 1 మిల్లీలీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవచ్చని ఉద్యానశాఖాధికారులు చెబుతున్నారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

జీడిమామిడి తోటల్లో తేయాకు దోమ (టీ దోమ)ను గుర్తించడం జరిగింది.. దీనికి రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. ముందుగా గుర్తిస్తే నష్టాన్ని చాలావరకూ నివారించుకోవచ్చు. టీ దోమ జీవిత చక్రం 20 నుంచి 30 రోజుల్లో ఆగిపోతుంది. జీడిమామిడి చెట్టు చుట్టూ పళ్లాలు చేసి కలుపులేకుండా చూసుకోవాలి. ముఖ్యంగా జనవరి నెలలో దీని ఉధృతి అధికంగా ఉంటుంది. ఇప్పటికే అప్రమత్తమయ్యాం. దీనిని సమర్థవంతంగా ఎదుర్కొంటాం.

- నూనె సుజాత,
ఉద్యానశాఖాధికారిణి, పెద్దాపురం

చెందుర్తిలో మహిళ దారుణహత్య



హత్యకు గురైన కుమారి

గొల్లప్రోలురూరల్, మార్చి 15: కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చెందుర్తిలో మహిళ దారుణహత్యకు గురైంది. సహజీవనం చేస్తున్న వ్యక్తే ఈ సంఘటనకు పాల్పడినట్టు చెబుతున్నారు. చెందుర్తి గ్రామానికి చెందిన అయినవిల్లి కుమారి (48) రెండు దశాబ్దాల కిందట భర్తతో విడిపోయింది. అప్పటి నుంచి అదే గ్రామానికి చెందిన తాటిపర్తి కనకలింగేశ్వరరావుతో సహజీవనం సాగిస్తోంది. కొంత కాలంగా కుమారి వేరే వ్యక్తితో సన్నిహితంగా ఉంటుందనే విషయంలో కనకలింగేశ్వరరావుతో ఘర్షణ జరుగుతోంది. గురువారం అర్ధరాత్రి ఇదే విషయంపై గొడవ జరిగింది. దీంతో మడత మంచం పట్టితో కుమారిని కొట్టి కనకలింగేశ్వరరావు హతమార్చాడు. ఈ సంఘటన స్థానికంగా సంచలనం కలిగించింది. పిఠాపురం సీఐ శ్రీనివాస్, గొల్లప్రోలు ఎస్ఐ బాలాజీలు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

యువతిని మోసగించిన కేసులో నిందితుడికి పదకొండేళ్లు జైలు

కాత్రేనికోన, మార్చి 15: యువతిని మోసగించిన కేసులో నేరం రుజువు కావడంతో ముద్దాయికి న్యాయస్థానం 11 సంవత్సరాల జైలు శిక్ష విధించింది. ఎస్ఐ ఎస్. నాగేశ్వరరావు తెలిపిన వివరాల మేరకు గుత్తుల వెంకటకిరణ్ బంటుమిల్లికి చెందిన ఒక యువతిని పెళ్లి చేసుకుంటానని నమ్మించి వంచనకు పాల్పడ్డాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు 2020 మే 27న అప్పటి ఎస్ఐ సంపత్‌కుమార్ కేసు నమోదుచేశారు. కోర్టులో వాదప్రతివాదాల అనంతరం నేరం రుజువుకావడంతో జిల్లా సెషన్స్ కోర్టు జడ్జి వైబెన్నయ్యనాయుడు ముద్దాయికి 11 సంవత్సరాలు జైలు, రూ. 5,000 జరిమానా విధిస్తూ తీర్పుచెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ మారిశెట్టి వెంకటేశ్వరరావు వాదించారు.





బోల్తాపడిన ఆటో.. (పక్కన) గాయపడ్డ విద్యార్థులను తరలిస్తున్న దృశ్యం

ఆటో బోల్తా.. పలువురు విద్యార్థులకు గాయాలు

ఎటపాక, మార్చి 15: పాఠశాలకు విద్యార్థులతో వెళ్తున్న ఆటోకు వానరాలు అడ్డురావడంతో వాటిని తప్పించబోయి విద్యార్థుల ఆటో అదుపుతప్పి బోల్తాపడిన ఘటన శుక్రవారం గుండాల-రాయనపేట మధ్యలో జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. రాయనపేట, వెంకటరెడ్డిపేట గ్రామాలకు చెందిన కొందరు విద్యార్థులు భద్రాచలంలోని ఓ ప్రైవేట్ పాఠశాలల్లో విద్యాభ్యాసం చేస్తున్నారు. ఈ క్రమంలో రోజు మాదిరిగానే విద్యార్థులు ఆటోలో పాఠశాలకు వెళ్తున్నారు. అయితే గుండాల- రాయనపేట మధ్యలో కల్వర్టు సమీపంలో వానరాలు ఒక్కసారిగా అడ్డురావడంతో తప్పించబోయి అదుపుతప్పి ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో పలువురు విద్యార్థులకు గాయాలయ్యాయి. గాయాలైన వారిని వేరే ఆటోలో చికిత్స కోసం భద్రాచలానికి తరలించి వైద్య చికిత్స అందించారు.



జాతీయ రహదారిపై వ్యాన్ ఢీకొనడంతో మృతి చెందిన రాంబాబు

గూడ్స్ వ్యాన్ ఢీకొని వ్యక్తి దుర్మరణం

రాజానగరం, మార్చి 15: రాజానగరం జాతీయ రహదారిపై నరేంద్రపురం జంక్షన్ వద్ద శుక్రవారం సాయంత్రం గూడ్స్ వాహనం ఢీకొని ఒక వ్యక్తి దుర్మరణం చెందాడు. మృతుడు గొల్లప్రోలుకు చెందిన దూది రాంబాబు (42)గా పోలీసులు గుర్తించారు. రాంబాబు గొల్లప్రోలు నుంచి మోటార్‌సైకిల్‌పై కోరుకొండ మండలం దోసకాయలపల్లిలోని కుమార్తె ఇంటికి బయలుదేరాడు. మార్గమధ్యలో రాజానగరం-నరేంద్రపురం జంక్షన్‌లో రోడ్డు దాటుతుండగా రాజమహేంద్రవరం వైపు వెళ్తున్న గూడ్స్ వాహనం మోటార్‌సైకిల్‌ను ఢీకొట్టడంతో రాంబాబు తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రాంబాబు హోటల్‌లో పనిచేస్తుంటాడు. ఈ మేరకు ఎస్ఐ పవన్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్న విజిలెన్స్ అధికారులు


పీడీఎస్ బియ్యం లారీపై విజిలెన్స్ దాడులు

సామర్లకోట, మార్చి 15: కాకినాడ జిల్లా సామర్లకోట పట్టణ శివారున కాకినాడకు భారీ లారీలో అక్రమంగా తరలివెళుతున్న పీడీఎస్ (రేషన్) బియ్యం రవాణాపై విజిలెన్స్ అధికారులు శుక్రవారం ఆకస్మిక దాడులు నిర్వహించి రూ.9 లక్షల 98 వేల 243 విలువైన 4,357 కిలోల రేషన్ బియ్యాన్ని 94 మూటలలో రవాణా చేస్తుండగా స్వాధీనం చేసుకున్నారు. విజిలెన్స్ అధికారులకు ముందుగా అందిన సమాచారం మేరకు టీఎస్ 28 టీబీ 3127 నంబరు గల అశోక్‌లేలాండ్ లారీని ఆపి సోదాచేయగా పీడీఎస్ బియ్యం అక్రమంగా రవాణా అవుతున్నట్టు అధికారులు గుర్తించారు. తెలంగాణ రాష్ట్రంలోని కొత్తగూడెం మండలంలోని మెదరబస్తి గ్రామానికి చెందిన వాహన యజమాని ఏ.పవన్, డ్రైవర్లు చందు, పి.సాయిభరత్‌ల ద్వారా పాల్వంచ నుంచి కాకినాడకు లారీలో తరలిస్తుండగా విజిలెన్స్ అధికారులు సోదాలు చేయడంతో అక్రమ రవాణా బహిర్గతమయ్యింది. రేషన్ బియ్యంగా నిర్ధారించి సదరు బియ్యాన్ని స్వాధీనం చేసుకుని సామర్లకోట ఎంఎస్‌వో కీర్తికి విజిలెన్స్ అధికారులు స్వాధీనపర్చారు. 6ఏ కింద కేసు నమోదు చేసి వాహనాన్ని సామర్లకోట పోలీసులకు అప్పగించారు. లారీ యజమాని, ఇద్దరు డ్రైవర్లపైనా క్రిమినల్ చర్యల నిమిత్తం తదుపరి దర్యాప్తు చేస్తున్నట్టు విజిలెన్స్ అధికారులు నాగవెంకటరాజు, లక్ష్మీనారాయణ, సీఎస్ డీటీ కీర్తి, విజయకుమారి, జీవానందంలు తెలిపారు.

20న అయోధ్యకు సూపర్‌లగ్జరీ బస్సు

కార్పొరేషన్(కాకినాడ), మార్చి 15: ఈనెల 20న కాకినాడ డిపో నుంచి అయోధ్యకు సూపర్‌లగ్జరీ బస్సు సర్వీసు ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ తెలిపారు. కాకినాడలో బయలుదేరి పూరి, కోణార్క్, భువనేశ్వర్, సాక్షిగోపాలం, జాజిపూర్, గయ, వారణాసి, ప్రయాగ్‌రాజ్, అయోధ్య, నైమిశారణ్యం, సీతామఢి క్షేత్రాలను చూపించి తిరిగి 30న కాకినాడ చేరుకుంటుందన్నారు. బస్సుకు టిక్కెట్ రూ.12,000 ధర నిర్ణయించారన్నారు. ఉదయం పలహారం, మధ్యాహ్నం, రాత్రి భోజన సదుపాయం కల్పించామన్నారు. వివరాలకు 7382910869, 7382910778 నెంబర్లను సంప్రదించాలన్నారు.

రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ విశ్రాంత జాయింట్ డైరెక్టర్ మృతి



కరప, మార్చి 15: ఉమ్మడి రాష్ట్రంలో వైద్య ఆరోగ్యశాఖ జాయింట్ డైరెక్టర్‌గా పనిచేసి పదవీ విరమణ పొందిన డాక్టర్ విప్పర్తి నాగరాజు బుధవారం సాయంత్రం కాకినాడ జిల్లా కరపలోని ఆయన స్వగృహంలో మృతిచెందారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు తోటలో డాక్టర్‌గా సుపరిచితులైన నాగరాజు వైద్యవృత్తిలో సుదీర్ఘకాలం పనిచేశారు. రంగంపేట, నగరం, సోంపేట, ఇందుకూరుపేట, దుగ్గుదూరు, అమలాపురం, కాకినాడ ఏపీఎస్పీ, పెదపూడి, తదితర పీహెచ్‌సీలలో వైద్యాధికారిగా పనిచేశారు. ఆ తరువాత ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా డిప్యూటీ డీఎంహెచ్‌వోగా, విశాఖపట్నం జిల్లా అడిషనల్ డీఎంహెచ్‌వోగా, శ్రీకాకుళం జిల్లా వైద్యాధికారిగా పనిచేసిన ఆయన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ వైద్యఆరోగ్యశాఖ జాయింట్ డైరెక్టర్‌గా విధులు నిర్వర్తించి 2000లో పదవీవిరమణ చేశారు. రిటైర్ అయిన తరువాత కూడా నిర్విరామంగా పేదప్రజలకు వైద్యసేవలందించారు. ఆయన మరణవార్త విని పలువురు శోకసముద్రంలో మునిగిపోయారు. నాగరాజు కుమారుడు, ఎస్టేర్ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ విప్పర్తి సుదర్శన్‌కుమార్ ఆధ్వర్యంలో ఎస్టేర్ కాంపౌండ్‌లో శుక్రవారం ఆదరణ కూడిక నిర్వహించారు. ఈసందర్భంగా చుట్టుపక్కల గ్రామాల నుంచి పలువురు విచ్చేసి నివాళులర్పించారు.

కాకినాడ

నేడు 'డయల్ యువర్ డీఎం'

ఏలేశ్వరం, మార్చి 15: ఆర్టీసీ ప్రయాణికులకు మెరుగైన సేవలందించేందుకు శనివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి 4గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఏలేశ్వరం డిపో మేనేజర్ జీవీ.సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ప్రయాణికులు తమ సూచనలు, సలహాలు 9959225532కు ఫోన్ చేసి తెలియజేయాలన్నారు. ప్రయాణానికి ఆర్టీసీ బస్సులే ఉత్తమమని ఆయన చెప్పారు.

పనులకు ఆమోదం...బిల్లుల చెల్లింపునకు గ్రీన్‌సిగ్నల్

గొల్లప్రోలు నగరపంచాయతీ అత్యవసర సమావేశం

గొల్లప్రోలు, మార్చి 15: ఎన్నికల నోటిఫికేషన్ శనివారం మధ్యాహ్నం 3గంటలకు రానుండటంతో నగరపంచాయతీ పాలకులు తమకు కావాల్సిన వారికి పనులు కట్టబెట్టేందుకు, బిల్లుల చెలింపునకు అత్యవసం సమావేశం పెట్టి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చేశారు. శుక్రవారం సాయంత్రం గొల్లప్రోలు నగరపంచాయతీ కార్యాలయంలో చైర్‌పర్సన్ గంద్రేటి మంగతాయారు అధ్యక్షతన అత్యవసర సమావేశం నిర్వహించారు. నోటిఫికేషన్ రాకుండానే తమ వారికి పనులు కట్టబెట్టుకునేందుకే అధిక ప్రాధాన్యత ఇచ్చారు. ఎంపీ ల్యాడ్స్ కింద రూ.20లక్షలతో మంజూరైన నాలుగు పనులను నామినేషన్ పద్ధతిపై కాంట్రాక్టుల కేటాయింపు, వివిధ అభివృద్ధి పనుల టెండర్ల ఆమోదాన్ని అజెండాలో చేర్చారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో 15వ ఆర్థిక సంఘం, సాధారణ నిధులతో చేపట్టిన పనులకు సంబంధించి రూ32.38లక్షల బిల్లులను 2022-23 ఆర్థిక సంవత్సరం ఆర్థిక సంఘం నిధుల నుంచి చెల్లించేందుకు సమావేశం ఆమోదం తీసుకున్నారు. కావాల్సిన వారికే పనులు కట్టబెట్టేందుకు, అయినవారికి బిల్లులు చెల్లించేందుకే హడావుడిగా సమావేశం పెట్టి ఆమోదం తీసుకున్నారన్న విమర్శలు వస్తున్నాయి.

నాగులాపల్లి సర్పంచ్ చెక్‌పవర్ పునరుద్ధరణ

కొత్తపల్లి, మార్చి 15: మండలంలో నాగులాపల్లి గ్రామ సర్పంచ్ వడిశెట్టి గౌరీ రాజేశ్వరి చెక్ పవర్‌ని పునరుద్ధరిస్తూ శుక్రవారం జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా ఉత్తర్వులు జారీ చేశారు. పంచాయతీ నిధుల దుర్వినియోగం చేశారనే ఆరోపణలపై విచారణ నిర్వహించిన అనంతరం జిల్లా పంచాయతీ అధికారిణి భారతి సౌజన్య ఈనెల 12న సర్పంచ్ గౌరీ రాజేశ్వరి చెక్ పవర్‌ను రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రత్యక్షం, పరోక్షంగా నిధులు దుర్వినియోగానికి పాల్పడలేదని, పీఆర్ చట్టం, ప్రభుత్వ నియామాలపై అవగాహన లేదని, కేవలం పరిపాలన పరమైన లోపాలకు సంబంధించిన అభియోగాలు అయినందన చెక్ పవర్ పునరుద్ధరించాలని కలెక్టర్‌కు అప్పీలు చేసుకున్నట్టు సర్పంచ్ తెలిపారు. అప్పీలును పరిశీలించిన కలెక్టర్ చెక్ పవర్‌ని పునరుద్ధరిస్తూ ఉత్తర్వులు జారీ చేశారని కలెక్టర్‌కు, డీపీవోలకు సర్పంచ్ కృతజ్ఞతలు తెలిపారు.

'టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి భారీ విజయం'

కాకినాడ సిటీ, మార్చి 15: రాబోయే ఎన్నికల్లో ఆంధ్రలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి భారీ విజయం సాధించి ప్రభుత్వం ఏర్పాటు చేయబోతోందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ అన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ నాలుగేళ్ల పది నెలల్లో జగన్ పాలనలో అన్ని వ్యవస్థలు నాశనమయ్యాయన్నారు. ఏ వర్గం వారూ సంతోషంగా లేరని, వైసీపీ పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని, ఇదే విషయాన్ని జాతీయ సర్వే సంస్థలు చేపడుతున్న సర్వేల్లో తేటతెల్లమవుతోందని అన్నారు. అత్యధికంగా 20కిపైగా లోక్‌సభ స్థానాలను ఈ కూటమి గెలుచుకోబోతోందని పలు సర్వేల్లో తేల్చి చెప్పడంతో రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయన్నారు. గ్రూప్-1 పరీక్షల విషయంలో జరిగిన అవకతవకలు చూస్తుంటే అవినీతి, అక్రమాల అడ్డా జగన్ ప్రభుత్వంగా చెప్పవచ్చని పేర్కొన్నారు.

'శెట్టిబలిజలకు సముచిత స్థానం కల్పించాలి'

సర్పవరం జంక్షన్, మార్చి 15: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో శెట్టిబలిజ సామాజిక వర్గానికి జిల్లాలో సముచిత స్థానం కల్పించాలని, లేకపోతే బీసీలంతా సంఘటితంగా పార్టీలకతీతంగా స్వతంత్ర అభ్యర్థిని ఎన్నికల బరిలో దించుతామని ఆ సంఘం కాకినాడ సిటీ అధ్యక్షుడు చొల్లంగి వీరబాబు, బీసీ వెల్ఫేర్ ప్రెసిడెంట్ వాసంశెట్టి భీమరాజు, శెట్టిబలిజ జనజాగృతి జనరల్ సెక్రటరీ కర్రి గోపాలకృష్ణ తెలిపారు. శుక్రవారం రమణయ్యపేట అర్బన్ తోట సుబ్బారావునగర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాకినాడ రూరల్లో శెట్టిబలిజ కులస్థులకు అసెంబ్లీ సీటు కేటాయించాలన్నారు. త్వరలో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేసి ఎన్నికల్లో పోటీ చేసేందుకు భవిష్యత్తు కార్యాచరణ ప్రణాళికను నిర్వహించనున్నట్లు తెలిపారు. నాయకులు మేడిశెట్టి ఈశ్వరరావు, పంపన మురళీ, కొప్పిశెట్టి చంద్రమౌళి, గుత్తుల రమణ ఉన్నారు.

'వైసీపీ ప్రభుత్వాన్ని ఇంటికి పంపించాలి'

సర్పవరం జంక్షన్, మార్చి 15: సీఎం జగన్ పాలనలో తొమ్మిదిసార్లు విద్యుత్తు చార్జీలు పెంచి 64 వేల కోట్ల భారం ప్రజలపై వేశారని, రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రజల గెలవాలని, రాష్ట్రం నిలవాలంటే వైసీపీ ప్రభుత్వాన్ని ఇంటికి పంపించాల్సిన సమయం ఆసన్నమైందని టీడీపీ రాష్ట్ర ఆరోగ్య విభాగ కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు ఓ ప్రకటనలో తెలిపారు. దేశంలో ఎక్కడాలేని రీతిలో నాసిరకం మద్యంతో సుమారు 30 లక్షల మంది ఆరోగ్యాన్ని పాడుచేసిన ఘనత సీఎంకే దక్కిందన్నారు. జాబ్ క్యాలెండర్ ప్రకారం పోస్టులు భర్తీ చేయకుండా నిరుద్యోగులను మోసం చేశారన్నారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీ-జనసేన,బీజేపీ కూటమిని అత్యధిక మెజార్టీతో గెలిపించి రాష్ట్రాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరికీ ఉందన్నారు.

'ఓటు హక్కు వినియోగించుకోవాలి'

గండేపల్లి, మార్చి 15: వచ్చే ఎన్నికల్లో ప్రతి ఒక్కరు సక్రమమైన మార్గంలో ఓటు హక్కు వినియోగించుకోవాలని పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి అన్నారు. మండలంలో సూరంపాలెం ఆదిత్య కళాశాలలో శుక్రవారం నిర్వహించిన ఓటుహక్కుపై అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ఓటు అనేది ప్రజాస్వామ్యంలో చాలా ముఖ్యమైనదన్నారు. ప్రతి ఎన్ఎస్ఎస్ వలంటీర్లు కూడా ఈ ఎన్నికల్లో భాగస్వాములు కావాలన్నారు. విద్యార్థులందరూ వెబ్‌కాస్టింగ్‌లో పాల్గొనాలని సూచించారు. ప్రతి ఒక్కరు ఓటు హక్కును కలిగి ఉండాలన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు అనేది ఆయుధం లాంటిదని, 18 ఏళ్ల నిండిన ప్రతి ఒక్కరు ఓటుహక్కు నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డి, ఎ.రమేష్, జగ్గంపేట సీఐ లక్ష్మణరావు, గండేపల్లి ఎస్ఐ ఎన్.రామకృష్ణ, సత్యనారాయణ, ఆంజనేయులు, రాంబాబు పాల్గొన్నారు.

'టీడీపీ కార్యకర్తలకు అండగా ఉంటా'

సర్పవరం జంక్షన్, మార్చి 15: తన వెన్నంటి ఉన్న టీడీపీ కార్యకర్తలకు అన్ని వేళలా అండగా ఉంటానని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పెంకే శ్రీనివాస బాబా అన్నారు. శుక్రవారం సర్పవరం శివారు భావనారాయణపురంలో పార్టీ కార్యకర్తలు, నాయకులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఇటీవల పార్టీలో జరిగిన రాజకీయ పరిణామాల పట్ల మనస్తాపం చెందానని, శ్రీనివాస బాబా ట్రస్ట్ ఆధ్వర్యంలో యధావిధిగా సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, తనను నమ్ముకున్న కార్యకర్తలు, నాయకులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ కాకరపల్లి సత్యవతిచలపతిరావు, మహిళా నాయకులు పాల్గొన్నారు.

'మోదీ పాలనలోనే దేశాభివృద్ధి'

ఏలేశ్వరం, మార్చి 15: ప్రధాని మోదీ పాలనలో దేశం ఎంతో అభివృద్ధి చెందిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామకుమార్ అన్నారు. పట్టణంలో షిర్డినగర్‌లో పార్టీ నేత ఉమ్మిడి వెంకట్రావు నేతృత్వంలో నిర్వహించిన సమావేశంలో ముఖ్యఅతిథిగా రామకుమార్ మాట్లాడుతూ వైసీపీ పాలనలో ఇసుక మాఫియా, ఇళ్ల స్థలాలు కొనుగోళ్లలో చాలా అవినీతి జరిగిందన్నారు. అవినీతి ప్రభుత్వానికి బుద్ధి చెప్పడానికే బీజేపీ, టీడీపీ, జనసేన పొత్తుతో ఎన్నికల్లో పోటీచేస్తున్నాయన్నారు. మండలంలోని తూర్పులక్ష్మీపురంలో ఉజ్వల గ్యాస్ కలెక్షన్లను సర్పంచ్ వీరంరెడ్డి భార్గవి అందజేశారు. కొల్లా శ్రీనివాస్, దొంతంవెట్టి చంద్రశేఖర్, ఎ.రాజా, వెంకట్రాయుడు తదితరులున్నారు.

బాబు, పవన్, లోకేశ్ చిత్రపటాలకు పాలాభిషేకం

జగ్గంపేట, మార్చి 15: జగ్గంపేట టీడీపీ కార్యాలయంలో టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి జ్యోతుల నెహ్రూ సమక్షంలో జిల్లా బీసీ సాధికార సగర కమిటీ జిల్లా అధ్యక్షుడు గుర్రం సుబ్బారావు ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సగరులను గుర్తించి సగర కులాన్ని బీసీడీ నుంచి బీసీ కేటగిరికి మారుస్తున్నామని నారా చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ప్రకటించిన సందర్భంగా చంద్రబాబు, పవన్, నారా లోకేశ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో వాసిరెడ్డి ఏసుబాబు, ఆకుల రామకృష్ణ, మారిశెట్టి భద్రం, పోతుల మోహన్‌రావు, జగ్గంపేట మండల టీడీపీ ఉపాధ్యక్షులు పోట్రూ కృష్ణ, బీసీ సాధికారిక సగర కమిటీ జిల్లా నాయకులు నంగన శ్రీను, గండికోట నాగేశ్వరరావు, పొంద్రు బాలనాగు తదితరులు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఆరుగురికి జరిమానా

గొల్లప్రోలు, మార్చి 15: గొల్లప్రోలు పోలీసుస్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన ఆరుగురు వ్యక్తులకు రూ.10వేల వంతున జరిమానా విధిస్తూ పిఠాపురం అదనపు జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ లీలా సాయి సుభాష్ తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించకుంటే రెండు రోజుల జైలుశిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు. ఈనెల 13,14,15వ తేదీల్లో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిని ఆరుగురిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచామని ఎస్ఐ బాలాజీ తెలిపారు.

మున్సిపల్ సిబ్బందిపై తేనెటీగల దాడి

సామర్లకోట, మార్చి 15: పట్టణ ప్రజలకు తాగునీరందించే ఫిల్టర్ బెడ్ వద్ద పని చేస్తున్న మున్సిపల్ సిబ్బంది ముగ్గురిపై తేనెటీగలు శుక్రవారం దాడిచేసి కుట్టడంతో అస్వస్థతకు గురయ్యారు. గిడుతూరి శ్రీనువాసరావు, ఎన్.రత్నరాజు, కె. సత్యనారాయణ రోజూలాగే విధులు నిర్వహిస్తుండగా సమీపంలో చెట్టుకు ఉన్న తేనెపట్టు నుంచి ఈగలు ఒక్కసారిగా కుట్టడంతో వారిని సామర్లకోట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

కాన్షీరాం చిత్రపటానికి నివాళి

కాకినాడ సిటీ, మార్చి 15: జగన్నాథపురం అన్నమ్మఘాటీ సెంటర్ వద్ద శుక్రవారం మహనీయుడు కాన్షీరాం జయంతి సందర్భంగా దళిత, గిరిజన, బీసీ, ముస్లిం, క్రైస్తవ ఐక్యవేదిక ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు జోకుబుర్ర భద్రం మాస్టారు కాన్షీరాం చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఐక్యవేదిక సభ్యులు నేల శంకరప్రసాద్ ఉన్నారు.

బీసీల రక్షణకు ప్రత్యేక చట్టాన్ని తీసుకొస్తాం

» ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప



పెద్దాపురంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చినరాజప్ప

పెద్దాపురం, మార్చి 15: టీడీపీ అధికారంలోకి రాగానే బీసీల రక్షణకు ప్రత్యేక చట్టాన్ని తీసుకువస్తామని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. మండలంలోని జె.తిమ్మాపురం గ్రామంలో శుక్రవారం నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ బీసీలకు 50 ఏళ్లకే రూ.4వేలు పింఛన్ సదుపాయం కల్పిస్తామన్నారు. జగన్ పాలనలో 300 మందికిపైగా బీసీలు క్రూరంగా హత్యకు గురయ్యారని ఆరోపించారు. సామాజిక న్యాయపరిశీలన కమిటీ ఏర్పాటుచేసి హక్కులను కాపాడతామన్నారు. అలాగే విద్యా పథకాలన్నీ పునరుద్ధరిస్తామన్నారు. కార్యక్రమంలో రాజప్ప తనయుడు నిమ్మకాయల రంగనాగ్, కొత్తెం వెంకట శ్రీనివాస్ (కోటి), కందుల విశ్వేశ్వరరావు, ఎలిశెట్టి నాని, గుత్తుల సూర్యావతీ శ్రీనివాస్,సింగన అరవింద్‌కుమార్ తదితరులున్నారు.

సామర్లకోటలో ప్రత్యేక పూజలు

సామర్లకోట, మార్చి 15: సామర్లకోట కంచి మహాసంస్థానం వ్యవస్థాపకుడు చంద్రాభట్ల చింతామణి గణపతిశాస్త్రి కుటుంబీకుల ఇంట జరిగిన పూజల్లో ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పాల్గొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా స్వయం వరపార్వతి అమ్మవారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. గణపతి శాస్త్రి సోదరుడు పతంజలి, సోదరిలు చంద్రాభట్ల లక్ష్మి, దేవులపల్లి సూర్యకుమారి ఆశీస్సులు స్వీకరించి ప్రసాదాలను అందుకున్నారు. ఎమ్మెల్యే తనయుడు రంగనాగ్, టీడీపీ నాయకులున్నారు. అనంతరం పలు క్రైస్తవ ప్రార్థనా మందిరాలను సందర్శించి రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన కూటమిని ఆదరించాలని కోరారు. విలేకర్లతో రాజప్ప మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం రూ.75 వేలకోట్ల సబ్‌ప్లాన్ నిధులను దారిమళ్లించిందని, తాము అధికారంలోకి వచ్చాక బీసీ సబ్‌ప్లాన్ నిధులు బీసీల కోసమే వినియోగించేలా చర్యలు తీసుకుంటామన్నారు. చట్టసభల్లో బీసీలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు కోసం తీర్మానం చేసి కేంద్రానికి పంపిస్తామన్నారు. స్టడీసర్కిల్, విద్యోన్నతి పథకాలు పునఃప్రారంభిస్తామన్నారు. బీసీ భవనాలు, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణాలను పూర్తి చేస్తామన్నారు.

చంద్రబాబును కలిసి నిర్ణయం ప్రకటిస్తా : వర్మ

వర్మకు అన్యాయం చేస్తే ఊరుకోమన్న కేడర్



పిఠాపురంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వర్మ

పిఠాపురం, మార్చి 15: టీడీపీ కోసం కుటుంబాన్ని, వ్యాపారాలను వదులుకుని కష్టించి పనిచేసిన పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మకు అన్యాయం చేస్తే సహించేది లేదని పలువురు నాయకులు, కార్యకర్తలు హెచ్చరించారు. వర్మ వెన్నంటే ఉంటామని, ఇండిపెండెంట్‌గా పోటీచేస్తే భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని ప్రకటించారు. పిఠాపురం నియోజకవర్గం నుంచి పోటీచేస్తానని పవన్‌కల్యాణ్ ప్రకటించిన నేపథ్యంలో స్థానిక పాత టీడీపీ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం ఏర్పాటుచేసిన సమావేశానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారు. ఈ సమావేశంలో పలువురు మాట్లాడుతూ తమకు కష్టం, ఇబ్బందులు ఉన్న సమయంలో అండగా నిలవడంతోపాటు ప్రజలకు అండగా నిలిచిన వర్మకు అన్యాయం జరిగిందనేది తమ ఆవేదన అన్నారు. కాగా టీడీపీ అధినేత చంద్రబాబు పిలుపుమేరకు శనివారం వెళ్లి కలుస్తానని మాజీ ఎమ్మెల్యే వర్మ తెలిపారు. నియోజకవర్గంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల అభిప్రాయాలను, వారి మనోగతాన్ని, బాధ, ఆవేదనను చంద్రబాబు ముందు ఉంచుతానని చెప్పారు. చంద్రబాబు కలిసిన తర్వాత తన నిర్ణయాన్ని తెలియజేస్తానని ప్రకటించారు. సమావేశం అనంతరం టీడీపీ జెండాలు లేకుండా తెలుపు రంగులో వర్మకు అండగా ఉంటామన్న జెండాలతో పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. కాగా సమావేశంలో మాట్లాడుతూ వర్మ సతీమణి లక్ష్మీదేవి భావోద్వేగానికి గురయ్యారు.

'పవన్‌ని గెలిపించేందుకు కృషి'



జనసేన కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న తంగెళ్ల

కొత్తపల్లి, మార్చి 15: ఎన్నికల్లో పిఠాపురం నియోజకవర్గం నుంచి పోటీచేస్తున్న జనసేనాధిపతి పవన్ కల్యాణ్‌ని అత్యధిక మెజార్టీతో గెలిపించి రికార్డు సృష్టించేందుకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో కృషి చేయాలని జనసేన పార్టీ పిఠాపుం ఇన్‌చార్జి తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. శుక్రవారం కొత్తపల్లిలో పార్టీ కార్యాలయాన్ని నాయకులు తెలగంశెట్ల వెంకటేశ్వరరావు, మత్సా అప్పాజీ, వాద్రదనబాబు, గవర రాంబాబులతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పవన్ పోటీ చేయడం పిఠాపురం నియోజకవర్గం ప్రజల అదృష్టమని.. టీడీపీ-జనసేన,బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అభివృద్ధిలో నియోజకవర్గం ముఖచిత్రం మారిపోతుందని చెప్పారు.

'వైసీపీ అరాచకాలు తెలుసుకోవాలి'

తాళ్లరేవు, మార్చి 15: వైసీపీ ప్రభుత్వం ఇళ్ల స్థలాలు పేదలకు ఇచ్చేక్రమంలో చేస్తున్న అరాచకాలు, అవినీతి ప్రజలంతా తెలుసుకోవాలని కోరుతూ చొల్లంగిలో ఇళ్ల స్థలాల కోసం నిరసనకారులు శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి కట్టా త్రిమూర్తులు మాట్లాడుతూ 45రోజులుగా పేదల ఇళ్లస్థలాలు చొల్లంగిలోనే ఇవ్వాలని దీక్షచేస్తున్న తమ పట్ల ప్రభుత్వం ఏమీపట్టనట్టు వ్యవహరిస్తుందన్నారు. పేదలకు పట్టాలిచ్చేవరకు నిరసన కొనసాగుతుందన్నారు. గ్రామంలో దుర్గాదేవికి వినతినిచ్చారు.

గిరిజనులకు టెంట్ సామగ్రి పంపిణీ

ప్రత్తిపాడు, మార్చి 15: నియోజకవర్గంలో మారుమూలగా కొండలపై ఉన్న అవల్లి, అనుమర్తి గిరిజనులకు శుక్రవారం నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి వరుపుల సత్యప్రభరాజా తన సొంత నిధులు రూ.1లక్షలతో కొనుగోలు చేసిన టెంట్ సామగ్రిని ప్రత్తిపాడు పార్టీ కార్యాలయం వద్ద పంపిణీ చేశారు. గిరిజనులు సంతోషం వెలిబుచ్చారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వత్సవాయి సూర్యనారాయణరాజు, పర్వత సురేష్‌బద్ది రామారావు, అమరాది వెంకట్రావు, జ్యోతుల పెదబాబు, ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, కౌన్సెలర్ బొదిరెడ్డి గోపాలకృష్ణ, చిక్కాల లక్ష్మణరావు ఉన్నారు. ఉమ్మడి అభ్యర్థిగా ఎంపికైన సత్యప్రభకు జిల్లా బీజేపీ అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్, నేతలు ఉమ్మడి వెంకట్రావు, కొల్లాశ్రీనివాస్ శాలువా కప్పి సన్మానించారు. మండలంలోని పెద్దిపాలెం గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు లొంగా వెంకటేష్, మరో 200 మంది వైసీపీ కార్యకర్తలు వైసీపీకి రాజీనామా చేసి సత్యప్రభ సమక్షంలో టీడీపీలోకి చేరారు.

వాసంశెట్టి సుభాష్ ప్రత్యేక పూజలు

కాజులూరు, మార్చి 15: రామచంద్రపురం నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి వాసంశెట్టి సుభాష్‌కి ప్రజలు ఘనస్వాగతం పలికారు. కాజులూరు మండలం గొల్లపాలెం ధనమ్మవారి ఆలయంలో ఆయన శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. టీడీపీ, జనసేన నాయకులు కార్లు, బైకులతో భారీ ర్యాలీ నిర్వహించారు. గొల్లపాలెం శివారు ధనలక్ష్మి పేట సమీపంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద దళిత మహిళలు, యువకులు ఘనస్వాగతం పలికారు. సుభాష్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వాసంశెట్టి సత్యం, వాసంశెట్టి రాధాకృష్ణ, పోతురాజు భీమారావు, చుండ్రు వీర్రాజు చౌదరి, జల్లి సత్యనారాయణ, సలాది సాయిబాబు, రాగం పోలరాజు, హనుమంతరావు, కోట తాతబ్బాయి పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలో చేరిక



జగ్గంపేట: టీడీపీలో చేరినవారితో నెహ్రూ

జగ్గంపేట, మార్చి 15: జగ్గంపేట మండలంలోని కృష్ణాపురం, వెంగయమ్మపురం, మల్లిశాల గ్రామాలకు చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ సమక్షంలో శుక్రవారం టీడీపీలో చేరారు. మల్లిశాలకు చెందిన సియ్యదుల బుజ్జి, సియ్యదుల శ్రీను, సియ్యదుల చిన్నోడు, తొర్రి రాంబాబు, నక్క రాజు శ్రీను, ఐదు నాగు.. వెంగయ్యమపురానికి చెందిన బొబ్బర రామకృష్ణ, కర్ణం పెద్దకాపు, దశరథ సింగర్‌బాబు, వల్లపు శ్రీనుకు టీడీపీలో చేరారు. ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, పైడిపాల సూరిబాబు, సర్వసిద్ధ లక్ష్మణరావు, వెలిశెట్టి శ్రీను, కానవరెడ్డి రామకృష్ణ, వల్లపు అన్నవరం,సియాదుల పెద్దకాపు ఉన్నారు.

ఉప్పలపాడులో ఆత్మీయ కలయిక

గండేపల్లి, మార్చి 15: జగ్గంపేట టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి జ్యోతుల నెహ్రూను అఖండ మెజార్టీతో గెలిపించుకోవాలని నాయకులు అన్నారు. ఉప్పలపాడు గ్రామంలో జనసేన నాయకులు తమటం నాగేంద్ర, తీర్నాల శ్రీమన్నారాయణ, సత్తి సోమరాజు, గంధం వెంకన్నబాబు, బీజేపీ, టీడీపీ నాయకులు పోరాటి వెంకన్న ఆధ్వర్యంలో జరిగిన ఆత్మీయ కలయిక సమావేశానికి నెహ్రూ ముఖ్య అతిథిగా విచ్చేశారు.

ఆర్యవైశ్యుల చేరిక

తుని రూరల్, మార్చి 15: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఆర్యవైశ్య మహాసభ జోనల్ కన్వీనర్, తుని ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు నార్ల రత్నాజీ ఆధ్వర్యంలో తునిలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సభకు మాజీ మంత్రి యన మల రామకృష్ణుడు, తుని టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి యనమల దివ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. యనమల సమక్షంలో కౌన్సిలర్ నార్ల భువన సుందరి, గ్రంధి కామేశ్వరరావు, నార్ల రాజా, నార్ల రమేష్, ఆర్యవైశ్యకుటుంబాలు టీడీపీలో చేరాయి.

అరాచక పాలనకు కౌంట్ డౌన్ ప్రారంభం

పంతం నానాజీ, కటకంశెట్టి ప్రభాకర్



జనసేనలోకి ఆహ్వానిస్తున్న పంతం నానాజీ

సర్పవరం జంక్షన్, మార్చి 15: సీఎం జగన్ వైసీపీ ప్రభుత్వ అరాచక పాలనకు కౌంట్ డౌన్ ప్రారంభమైందని, ప్రజల అభీష్టం మేరకు అధికారంలోకి రాబోయేది టీడీపీ-జనసేన,బీజేపీ ప్రభుత్వమేనని కాకినాడ రూరల్ జనసేన, టీడీపీ ఉమ్మడి అభ్యర్థి పంతం నానాజీ, టీడీపీ కో ఆర్డినేటర్ కటకంశెట్టి ప్రభాకర్ (బాబీ) అన్నారు. శుక్రవారం వలసపాకల గంగరాజునగర్‌లో జనసేన పార్టీ కార్యాలయంలో 48వ డివిజన్ నుంచి వైసీపీకి చెందిన ఎస్సీ సెల్ నాయకులు ఆనంద్ పాల్ నాయకత్వంలో సుమారు 160 మంది యువకులు, మహిళలు జనసేన పార్టీలో చేరారు. వీరికి జనసేన కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎస్సీబీసీ,మైనారిటీల ఓట్లతో అధికారంలోకి వచ్చిన సీఎం జగన్ వీరిపై దాడులు, అక్రమ అరెస్ట్‌లతో ఇబ్బందులకు గురిచేశారని విమర్శించారు. వారి అభివృద్ధి, సంక్షేమం కోసం ఈ ప్రభుత్వం ఏమీ చేయలేదన్నారు. రాష్ట్ర ప్రజల సమగ్ర అభివృద్ధి ఉమ్మడి ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు. ఇరుపార్టీల క్యాడర్‌లు ఒకరికొకరు సమన్వయం చేసుకుంటూ పార్టీ విజయానికి కృషి చేయాలని కోరారు. టీడీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు కొల్లా బత్తుల అప్పారావు, పాలిక రమణ, మాగాపు మహేష్,ముమ్మిడి వాసు తదితరులు ఉన్నారు.

యనమల బిడ్డగా వచ్చా.. ఆశీర్వదించండి

తుని ఉమ్మడి అభ్యర్థి యనమల దివ్య



ఎస్.అన్నవరంలో ప్రచారం చేస్తున్న దివ్య

తుని రూరల్, మార్చి 15: యనమల బిడ్డగా మీ ముందుకు వచ్చానని, అండగా ఉంటాను ఆశీర్వదించాలంటూ తుని టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి యనమల దివ్య ఎస్.అన్నవరం గ్రామం ప్రచారంలో ప్రజలను కోరారు. శుక్రవారం ఎస్.అన్నవరంలో టీడీపీ మేనిఫెస్టో అంశాలు ప్రజలకు వివరించి టీడీపీ, జనసేన ప్రభుత్వాలతో అన్ని వర్గాలకు మేలు జరుగుతుందని స్పష్టం చేశారు. రానున్న ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేసి తనను అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఆమె వెంట నియోజకవర్గానికి చెందిన టీడీపీ నాయకులు యనమల శివరామకృష్ణన్, సుర్ల లోవరాజు, చింతమనీడి నాగ సోమరాజు (అబ్బాయి), మోతుకూరి వెంకటేష్, పోలిశెట్టిరామలింగేశ్వరరావు, వంగలపూడి బుజ్జి, గజ్జి అప్పలరాజు, జక్కాన రామునాయుడు ఉన్నారు.

మరిడమ్మకు బంగారు, వెండి పుష్పాలతో అర్చన

పెద్దాపురం, మార్చి 15: స్థానిక మరిడమ్మ దేవస్థానంలో అమ్మవారికి బంగారు వెండి పుష్పాలతో శుక్రవారం అర్చన కార్యక్రమం నిర్వహించారు. దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ చేబ్రోలు రామ్మోహనరావు ఆధ్వర్యంలో వేదపండితులు ఈ కార్యక్రమం చేపట్టి భక్తులకు ప్రసాదాలను వితరణ చేశారు.

వాటర్ ప్లాంటు ప్రారంభం



ప్లాంటును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

పిఠాపురం, మార్చి 15: పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిలో దాతలు గుత్తుర్తి వెంకట విజయేంద్ర, దుగ్గిరాల మురళీకృష్ణ సమకూర్చిన నిధులతో నిర్మించిన ఆర్వో మినరల్ వాటర్ ప్లాంటును శుక్రవారం ఎమ్మెల్యే పెండెం దొరబాబు ప్రారంభించారు. రోగులకు సురక్షితమైన నీటిని అందించేందుకు దాతలు ముందుకొచ్చి ఆర్వో ప్లాంటు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అనంతరం ప్రభుత్వాసుపత్రి(సీహెచ్‌సీ)లో రూ.కోటి వ్యయంతో చేపట్టే అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. కార్యక్రమాల్లో ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ సుజాత, డీసీహెచ్ఎస్ స్వప్న, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు బొజ్జా దొరబాబు, పెదపాటి రమేష్, చెల్లి శోభ, దాతలు, ప్రజాప్రతినిధులు,వైద్యులున్నారు.

రైతులకు రుణాలు

గొల్లప్రోలు రూరల్, మార్చి 15: మండలంలోని చేబ్రోలు విశాల సహకార పరపతి సంఘం ద్వారా రైతులకు రూ.31కోట్లు రుణాలు అందించినట్లు సొసైటీ అధ్యక్షుడు ఉలవకాయల బాబ్జి తెలిపారు. సొసైటీ కార్యాలయ ఆవరణలో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన సమావేశంలో రైతులకు రూ.98లక్షలను బోనస్‌గా అందజేశారు.

18న వికాసలో జాబ్‌మేళా

వికాస పీడీ లచ్చారావు

కాకినాడ సిటీ, మార్చి 15: కాకినాడ వికాస కార్యాలయంలో ఈనెల 18న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు వికాస పీడీ కె.లచ్చారావు తెలిపారు. ఈ జాబ్‌మేళాలో పలు కంపెనీల్లో వివిధ పోస్టులకు ఇంటర్వ్యూలు జరపనున్నారన్నారు. ఈ ఉద్యోగాలకు ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిప్లమో, డిగ్రీ, బీటెక్ ఉత్తీర్ణులైన 35ఏళ్లలోపు అభ్యర్థులు అర్హులన్నారు. వారికి నెలకు రూ.12వేల నుంచి రూ.25వేల వరకు జీతం, భోజనం, వసతి, రవాణా సౌకర్యం ఆయా ఉద్యోగాల ఆధారంగా ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు సోమవారం ఉదయం 9 గంటలకు కాకినాడ కలెక్టరేట్ వికాస కార్యాలయం వద్దకు సర్టిఫికెట్ల జిరాక్స్‌లతో హాజరుకావాలన్నారు. వివరాలకు 77993 76333 నెంబరులో సంప్రదించాలని పీడీ తెలిపారు.

ఘనంగా చండీహోమం

అన్నవరం, మార్చి 15: రత్నగిరి క్షేత్రరక్షకిగా పూజలందుకుంటున్న వనదుర్గ ఆలయంలో శుక్రవారం చండీహోమం ఘనంగా జరిగింది. ఉదయం 9గంటలకు పండితులు గణపతిపూజతో కార్యక్రమం ప్రారంభించారు. అమ్మవారికి చండీ సప్తసతి పారాయణలు, మూలమంత్రజపములు పఠించారు. 11గంటలకు పవిత్ర హోమగుండంలో సుగంధద్రవ్యాలను అర్పించి పూర్ణాహుతి గావించారు. చతుర్వేదపండితుల వేదాశీర్వచనాలు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలందజేశారు.

ఏటుగట్టు పరిశీలన

తాళ్లరేవు, మార్చి 15: ఇంజరం పంచాయతీ పరిధి అరటి కాయలంక ఏటుగట్టు ఆక్రమణను తహశీల్దార్ ఎమ్.శ్రీనివాసరావు శుక్రవారం పరిశీలించారు. ఫాహౌస్‌కి సంబంధించిన యాజమాన్యం ఏటుగట్టు మట్టిని తొలగించి అనాధికార నిర్మాణాలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ తెలిపారు. హెడ్‌వర్క్ అధికారులు రిపోర్టును తీసుకుని నివేదిక జిల్లా కలెక్టర్‌కు పంపించనున్నట్టు చెప్పారు. మండల సర్వేయర్, ఆర్ఐ, వీఆర్వో తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుడికి ఆర్థికసాయం

తాళ్లరేవు, మార్చి 15: గాడిమొగ వాటరు ట్యాంక్ వద్ద పనిచేస్తున్న దివ్యాంగుడు పంపు ఆపరేటర్ సంగాడి సతీష్‌కు సర్పంచ్ కామాడి గోవలక్ష్మి రూ.10వేలు ఆర్థిక సాయం శుక్రవారం అందించారు. సతీష్‌ఇటీవల వాటరు ట్యాంక్ వద్ద పని చేస్తూ కాలుజారి గాయాలపాలయ్యడు. దీంతో సర్పంచ్ కామాడి గోవలక్ష్మి, మాతరాజు, పంచాయతీ కార్యదర్శి విజెవి. రమణ, సిబ్బంది పరామర్శించి ఆర్థికసహాయం అందించారు.

జనరేటర్ మాయంపై ఫిర్యాదు

తాళ్లరేవు, మార్చి 15: తాళ్లరేవు తహశీల్దార్ కార్యాలయానికి సంబంధించిన పాతజనరేటర్‌ను ఒక వైసీపీ నాయకుడు అమ్మేశాడని వైసీపీ గ్రామకమిటీ అధ్యక్షుడు ఆకుల వెంకన్న, ప్రధాన కార్యదర్శి బొంతు వీరమోహన్ ఆరోపించారు. జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. తహశీల్దార్ ఎమ్.శ్రీనివాసరావుతో జనరేటర్ విషయంపై చర్చించి పాతజనరేటర్‌ను తహశీల్దార్ కార్యాలయానికి రప్పించాలని కోరారు.

ఎ.మల్లవరం ప్రిన్స్‌పాల్ సస్పెన్షన్

రౌతులపూడి, మార్చి 15: ఎ.మల్లవరం సాంఘిక సంక్షేమ శాఖ ప్రిన్సిపాల్ ప్రసాదానంను ఉన్నాతాధికారులు సస్పెండ్ చేశారు. కళాశాలలో విద్యార్థులు ఉండగా మద్యం తాగడం, మద్యం బాటిళ్లను వారిని పట్టుకోమనడం వంటివి చేయడంతో ప్రిన్స్‌పాల్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి.

బొద్దవరంలో సైకిల్ షెడ్ నిర్మాణం

కోటనందూరు, మార్చి 15: బొద్దవరం గ్రామంలో రోటరి క్లబ్ డిస్ట్రిక్ గవర్నర్ నిధులు రూ.లక్షతో విద్యార్థులకు సైకిల్ షెడ్ నిర్మించారు. ప్రాధానోపాధ్యాయులు సీహెచ్ వెంకటరమణ, రోటరీ అధ్యక్షులు కెఎస్.వర్మ, కే.ఈశ్వర్ గణేష్, సీహెచ్ మంగరాజు, వీర్రాజు, ఎస్.రామచంద్రరావు తదితరులున్నారు.